ఉపాధికి నిలయంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

కొత్త పరిశ్రమలు ఏర్పాటుకావడానికి, ఉపాధి అవకాశాలు విస్తృతమవ్వడానికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలే కారణమని గణాంక నివేదిక కుండబద్దలు కొట్టింది. 30 రోజుల్లోనే పరిశ్రమల ఏర్పాటుకు మార్గాన్నిసుగమం చేసే టీఎస్ఐపాస్, ఆన్‌లైన్‌లోనే లేఅవుట్‌లకు అనుమతినిచ్చేందుకు ఉద్దేశించిన టీఎస్‌బీపాస్‌తో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు క్యూకట్టినట్టు నివేదిక ప్రశంసించింది. ఇక, ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ సెంటర్ టీహబ్, దేశంలోనే అతిపెద్ద ప్రోటోటైప్ సెంటర్ టీవర్క్స్, మహిళా పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహానికి దేశంలోనే తొలిసారిగా తీసుకొచ్చిన ఇంక్యుబేటర్ వీహబ్‌తో ఐటీ, సేవారంగాల్లో కొత్త కంపెనీల ఏర్పాటు జరిగిందని నివేదిక వెల్లడించింది.

జనాభా తక్కువగా ఉన్నా.. జీవీఏ భేష్

తెలంగాణ ఏర్పాటుకు ముందు సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో వలసలు అనేవి నిత్యకృత్యంగా మారిన విషయం తెలిసిందే. అయితే, రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టి భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. దీంతో అనతికాలంలోనే తెలంగాణ.. పలు పెద్ద రాష్ట్రాలను వెనక్కునెట్టి పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనలో అగ్రస్థానానికి చేరుకున్నది. తెలంగాణలో ముఖ్యంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అత్యధికంగా 2,436 పరిశ్రమలు ఉండగా, వాటిల్లో 1,67,406 మంది ఉద్యోగులు, మరో 1,24,469 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలున్నాయి. మొత్తం రాష్ట్రంలోని పరిశ్రమల్లో ఒక్క మేడ్చల్-మల్కాజ్‌గిరిలోనే 23.5శాతం ఉండగా, కార్మికులు, ఉద్యోగులు సైతం అధికంగా ఈ జిల్లాలో పనిచేస్తున్నారు. పరిశ్రమల జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్)లో తెలంగాణ.. దేశంలో 9వ స్థానంలో నిలిచింది. 2022-23లో దేశ పరిశ్రమల జీవీఏలో తెలంగాణ పరిశ్రమల వాటా 3.37శాతంగా నమోదైంది. దేశ జనాభాలో తెలంగాణ జనాభా 2.8శాతమే అయినప్పటికీ జీవీఏలో మాత్రం 3.37శాతంగా ఉండడం గమనార్హం.

హైదరాబాద్ కేంద్రంగా..

హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లోని పారిశ్రామికవాడల్లో పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉదాహరణకు నాచారం, చెర్లపల్లి, ఇబ్రహీంపట్నం, కాటేదాన్, బాలానగర్, జీడిమెట్ల, పటాన్‌చెరు, రామచంద్రాపురం తదితర పారిశ్రామికవాడల్లో యూపీ, బీహార్, ఒరిస్సా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు అత్యధికంగా పనిచేస్తున్నారు. ఒకప్పుడు బీహెచ్ఈఎల్, ఎన్ఎండీసీ, హెచ్ఎంటీ, బీఈఎల్, ఐడీపీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ, హెచ్ఏఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలకు నిలయంగా ఉన్న హైదరాబాద్... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడిన తరువాత విభిన్న రంగాలకు చెందిన పరిశ్రమలకు నిలయంగా మారి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ఒక్కటంటే ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ పరిశ్రమ ఏర్పాటు కాకపోగా, ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో కేసీఆర్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు పూర్తిగా మారిపోయి రాష్ట్ర పేరు ప్రఖ్యాతులు విశ్వవ్యాప్తమయ్యాయి. తాజా నివేదికను విశ్లేషిస్తే ఇది నిజమేనని అర్థమవుతున్నది.

తెలంగాణలో పరిశ్రమల వివరాలు

- 2023నాటికి రాష్ట్రంలో ఏర్పాటైన మొత్తం పరిశ్రమలు - 13,063
- పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు - 15.45 లక్షలు
- మొత్తం పరిశ్రమల్లో మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల వాటా - 43.4%

టీఎస్ఐపాస్‌తో వేగవంతం

ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనలో పారిశ్రామిక రంగం ఎంతో కీలకమనే విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే అప్పటి సీఎం కేసీఆర్ పారిశ్రామికరంగ ప్రముఖులతో సమావేశమై నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టారు. టీఎస్ఐపాస్ విధానం చేపట్టి సులభంగా పరిశ్రమలకు అనుమతులు, ఆకర్షణీ య ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రారంభించా రు. ఫలితంగా పరిశ్రమల స్థాపన ఊపందుకున్నది. రాష్ట్ర గణాంకాల శాఖ వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో టీఎస్ఐపాస్ విధానం ప్రవేశపెట్టాక పరిశ్రమల ఏర్పాటు వేగవంతమైంది. 13,063 పరిశ్రమలకుగాను 10,368 పరిశ్రమలు కొనసాగుతుండగా, వీటిలో 7,08,219 మంది కార్మికులు, 8,37,235మంది ఉద్యోగులు కలిపి మొత్తంగా 15.45లక్షలమంది పనిచేస్తున్నారు. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, హర్యానా తరువాత పరిశ్రమల్లో అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఏడవ స్థానంలో నిలిచింది. హర్యానా మినహా చిన్న రాష్ట్రాల క్యాటగిరీలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.

బ్రాహ్మణ అధ్యయన కేంద్రం ఏర్పాటు

- బ్రాహ్మణ విద్యార్థులకు చేయూత నందించడమే లక్ష్యం
- సివిల్ సర్వీసెస్ పరీక్షార్థులకు ఉత్తమ శిక్షణ
- బ్రాహ్మణ ప్రముఖుల భేటీలో కీలక నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): బ్రాహ్మణులకు సాధికారత సాధించడంతోపాటు వారికి చేయూత, విద్య, శిక్షణ అందించే లక్ష్యంతో బ్రాహ్మణ అధ్యయన కేంద్రం ఏర్పాటైంది. ఈ కేంద్రం సేవలు, కార్యాచరణ, విధివిధానాల రూపకల్పనపై సోమవారం కొందరు బ్రాహ్మణ మేధావులతో హైదరాబాద్‌లో ఇష్టాగోష్టి సమావేశం జరిగింది. రచయిత, ముఖ్యమంత్రి పూర్వ ప్రధాన ప్రజా సంబంధాల అధికారి వనం జ్వాలా నరసింహారావు నివాసంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ యజమాని ఒద్దిరాజు విజయ్, వాస్తు నిర్మాణరంగ నిపుణుడు రవి, పారిశ్రామికవేత్త చెరువు రాంబాబు, దర్శనం సంపాదకుడు మరుమాముల వెంకటరమణశర్మ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, అవసరాలు, ఆకాంక్షలపై లోతుగా చర్చించి ఒక సమగ్ర కార్యాచరణతో బ్రాహ్మణ అధ్యయన కేంద్రం ద్వారా సేవలందించాలని నిర్ణయించారు. ఈ కేంద్రం ద్వారా అనేకమంది బ్రాహ్మణ మేధావులు, నిపుణులతో మరిన్ని సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం గ్రాడ్యుయేషన్ చదువుతున్న, గ్రాడ్యుయేషన్ పూర్తయిన ప్రతిభ గల బ్రాహ్మణ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఈ కేంద్రం సహకారంతో ఉత్తమ శిక్షణ ఇప్పించాలని నిశ్చయించారు. ఇందు కోసం త్వరలోనే ఒక ప్రకటన జారీ చేసి అర్హులైన ప్రతిభగల బ్రాహ్మణ విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రముఖ కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పించాలని, భవిష్యత్తులో తమ సేవలను విస్తరించి మరిన్ని కార్యకలాపాలు చేపట్టాలని నిర్ణయించారు. త్వరలో బ్రాహ్మణ అధ్యయన కేంద్రం కార్యాలయం, అంకితభావంతో పనిచేసే సిబ్బందితో పూర్తిస్థాయి సేవలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

కేసీఆర్, హరీశ్ పిటిషన్‌పై తీర్పు వాయిదా

హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు పూర్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై దర్యాప్తు జరపాలని కోరుతూ నమోదైన ప్రైవేటు ఫిర్యాదులో కింది కోర్టు నోటీసులు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో ఇరుపక్షాల వాదనలు ముగిశాయి. దీంతో తీర్పును తర్వాత వెలువరిస్తామని జస్టిస్ కే లక్ష్మణ్ ప్రకటించారు. అంతకుముందు ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారు నాగవెల్లి రాజలింగమూర్తి మరణించినప్పటికీ ఆ ఫిర్యాదు వెనుక ప్రజాప్రయోజనం ఉన్నదని, ఆ ఫిర్యాదుపై కింది కోర్టులో విచారణ కొనసాగించాలని కోరారు. ఫిర్యాదులో ఎనిమిది మంది సాక్షులున్నారని, వారిని విచారించే అధికారం కింది కోర్టుకు ఉన్నదని చెప్పారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడి కుమార్తె ఇంప్లీడ్ కావాలనుకుంటున్నట్టు పత్రికల్లో కథనాలు వచ్చాయని తెలిపారు. ఈ వాదనను కేసీఆర్, హరీశ్ తరపు న్యాయవాది టీవీ రమణారావు తీవ్రంగా వ్యతిరేకించారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మరణించినందున కింది కోర్టు ఎవరిని విచారిస్తుందనే సందేహాన్ని వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినవారు లేనప్పుడు ఆ ఫిర్యాదు విచారణార్హం కాదని, సుప్రీం కోర్టు తీర్పులు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వివరించారు. అయినప్పటికీ పిటిషనర్లకు జిల్లా కోర్టు నోటీసులు జారీచేయడం చట్టవిరుద్ధమని చెప్పారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ స్పందిస్తూ.. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఎలా నిర్ణయాలు తీసుకోగలమని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించారు. ఈ కేసులో ఫిర్యాదుదారుడి కుమార్తె ఇంప్లీడ్ అయితే అప్పుడు పరిశీలిద్దామని చెప్పారు. ప్రస్తుతం ఫిర్యాదుదారుడు జీవించి లేనందున ఆయన ఫిర్యాదుపై విచారణ చేయాలో లేదో తర్వాత తేలుస్తామని పేర్కొంటూ.. తీర్పును వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

27నుంచి కాళేశ్వరంపై కమిషన్ విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి24 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణను 27 నుంచి పున:ప్రారంభించనున్నది. ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన ఇంజినీర్లు, సీసీ డిజైన్లు, ఓఅండ్ఎం ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు సమర్పించిన అఫిడవిట్లపై బహిరంగ విచారణ పూర్తిచేసింది. క్షేత్రస్థాయిలో పనిచేసిన ఇంజినీర్లు, ఇరిగేషన్‌శాఖకు సంబంధించి పూర్వ, ప్రస్తుత సెక్రటరీలు, కమిషన్ ఎదుట అఫిడవిట్లు దాఖలు చేసిన రిటైర్డ్ ఇంజినీర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలను సైతం విచారించింది. విచారణ తుది దశకు చేరగా, మరోసారి 27 నుంచి ఇంజినీర్లు, సీడీవో విశ్రాంత సీఈ నరేందర్‌రెడ్డి, కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీ హరిరాం తదితరులను విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వం కమిషన్ గడువును ఇటీవలనే 2 నెలలకు పొడిగించింది.

మెదక్-ఎల్లారెడ్డి రోడ్డు విస్తరణకు లైన్‌క్లియర్

- జంతువుల రాకపోకల కోసం ప్రణాళికల్లో మార్పులు
- మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం: అటవీ శాఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణకు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు (స్టేట్ వైల్డ్‌లైఫ్ బోర్డు) నిర్ణయించింది. సచివాలయంలో సోమవారం అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన తెలంగాణ వన్యప్రాణి సంరక్షణ బోర్డు 8వ సమావేశం జరిగింది. అటవీ-జీవవైవిధ్య నిర్వహణను పెంచడానికి నిపుణులు చేసిన సిఫారసులను బోర్డు ఆమోదించింది. కవాల్ టైగర్ రిజర్వు బఫర్ ఏరియాలో పంచాయతీ రోడ్ల నిర్మాణం కోసం సవరించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ సెల్‌ఫోన్ టవర్ల అంశంలో ఐదు ప్రతిపాదనలపై ఎస్బీడబ్ల్యూఎల్ సమావేశంలో చర్చించారు. అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణాలను రక్షించే విధంగా పటిష్ఠ చర్యలు తీసుకోవాలనే ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. పోచారం వన్యప్రాణి అభయారణ్యం గుండా వెళుతున్న మెదక్-ఎల్లారెడ్డి రహదారి విస్తరణకు వైల్డ్ లైఫ్ బోర్డు అనుమతిచ్చింది. రక్షిత అటవీ ప్రాంతాల ద్వారా ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (వోఎఫ్సీ) లైన్‌లు వేయడానికి ఉన్న ప్రతిపాదనలపై చర్చించారు. నాగార్జునసాగర్ డివిజన్‌లోని పెద్దగట్టులో, ములుగులో 11కేవీ సబ్-స్టేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మాణాలకు ఆమోదం తెలిపింది. మానవ-వన్యప్రాణుల సంఘర్షణ బాధితులకు పరిహారం చెల్లింపులను మీ-సేవా కేంద్రాల ద్వారా అందించడానికి కార్పస్ నిధిని రూపొందించాలని ప్రతిపాదించింది. టైగర్ రిజర్వులలోని గ్రామాల తరలింపులో భాగంగా కవాల్, అమ్రాబాద్ నుంచి 1,230 కుటుంబాలను నిర్దేశించిన ప్రాంతాలకు తరలించడంపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా జూలాజికల్ పార్కులు, జాతీయ ఉద్యానవనాలు, అర్బన్ పార్కులను పెంచడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఇప్పటికే ఉన్న సహజ వృక్షసంపదను కాపాడుతూ ..ఈ పార్కులలో స్థానిక జాతుల మొక్కలను నాటడానికి ప్రాధాన్యం ఇవ్వాలని కూడా బోర్డు నిర్ణయించింది. ఈ సమావేశంలో రాష్ట్ర వైల్డ్‌లైఫ్ బోర్డు సభ్యులు,ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు,రాందాస్‌నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ సదీమ్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, వైల్డ్‌లైఫ్ కన్జర్వేటర్ ఏలుసింగ్ మేరు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కీచకోపాధ్యాయుడిపై పోక్సో కేసు

- ఆలస్యంగా వెలుగులోకి

కోనరావుపేట, ఫిబ్రవరి 24: ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోనరావుపేట మండలం నిజామాబాద్ జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు బ్రహ్మం 2నెలల క్రితం విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అప్పుడు పిల్లలు తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లగా వారు ప్రధానోపాధ్యాయుడికి ఫిర్యాదు చేశారు. హెచ్ఎం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ఉపాధ్యాయుడిని మందలించారు. 4రోజుల క్రితం పాఠశాలలో 'పోలీస్ అక్క' నిర్వహించి గుడ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా టీచర్ అసభ్యకర ప్రవర్తనను తెలుపగా ఆయనపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెంకటేశ్వర్లు చెప్పారు.

ఒకే కాన్పులో ముగ్గురు జననం

గజ్వేల్, ఫిబ్రవరి 24: గజ్వేల్ ప్రభుత్వ జిల్లా దవాఖానలో సోమవారం ఓ గర్భిణి ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి కాగా, ముగ్గురూ ఆరోగ్యంగా ఉన్నారు. ములుగు మండలం అడవిమజీద్‌కు చెందిన బత్తిని నాగరత్న-నర్సింహులు దంపతులకు ఏడేండ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో దవాఖానల్లో చూపించుకున్నారు. ఏడో సంవత్సరం నాగరత్న గర్భం దాల్చడంతో ప్రతినెలా గజ్వేల్ దవాఖానలోనే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రసవం కోసం ఆదివారం దవాఖానలో చేరగా, ఆమెకు సోమవారం వైద్యులు మంజుల, త్రివేణి, సుశీల, అఫ్రోజ్ సిజేరియన్ చేయగా, మొదట ఇద్దరు అబ్బాయిలు తరువాత అమ్మాయికి జన్మనిచ్చింది. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ అన్నపూర్ణ, ఆర్ఎంవో డాక్టర్ రాము అభినందించారు.

ఆధార్ ఉంటేనే పేదలకు వైద్యమా?

- సర్కారు దవాఖానల్లో ఆంక్షలపై పిల్
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేవలు పొందేందుకు రోగులు తమ ఆధార్ కార్డు లాంటి ఆధారాలు చూపాలని ఆంక్షలు విధించడంపై హైకోర్టు ప్రభుత్వాన్ని నిలదీసింది. వైద్యసేవలు పొందాలనుకునే పేదలు ఆధార్ కార్డును సమర్పించాల్సిన అవసరం ఉన్నదా? అని ప్రశ్నించింది. ఆధార్ కార్డు లేనివారికి ఉస్మానియా దవాఖానలో చికిత్స అందించడం లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున్యాయవాది కాశ్ బాగ్గేకర్ వాదన వినిపిస్తూ.. వైద్యసేవలను ఆధార్ కార్డుతో ముడిపెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఆరోగ్యం ప్రజల ప్రాథమిక హక్కని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని, ఆధార్ కార్డు ఉంటేనే వైద్యం చేయాలన్న నిబంధన ఎక్కడా లేదని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఆధార్ కార్డుతో నిమిత్తం లేకుండా వైద్యసేవలు అందించేలా ఆదేశించాలని కోర్టును కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. ఆధార్ కార్డు లేనివారికి సైతం ప్రభుత్వ దవాఖానల్లో సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. దీంతో అందుకు ఆధారాలు చూపాలని ఆదేశిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.

బడా ఏజెన్సీలకే ఇసుక!

మొదటిపేజీ తరువాయి...

ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం నడుస్తున్న ఇసుక లారీలన్నీ ఇక ఏజెన్సీల ఆధీనంలోనే నడవాల్సి ఉంటుంది. ఎంతోకాలంగా ఇసుక రవాణాకు సంబంధించి టీజీఎండీసీలో సుమారు 40 వేలకు పైగా లారీలు నమోదై ఉన్నాయి. వీటి యజమానులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని ఇసుక క్వారీల నుంచి హైదరాబాద్ సహా వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. ఇసుక కావాల్సిన వారు నేరుగా లారీ యజమానులతో, లేదా స్థానికంగా ఉండే ఇసుక యార్డుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఇసుక లారీల యజమానులు ఇష్టారాజ్యంగా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే కారణంతో ఈ విధానాన్ని మార్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇటీవల మైనింగ్ అధికారులతో జరిగిన సమావేశంలో ఇసుక రవాణాలో సమూల మార్పులు తేవాలని ముఖ్యమంత్రి సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇసుక క్వారీల నిర్వహణ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లను పిలిచిన టీజీఎండీసీ, తాజాగా ఇసుక రవాణా బాధ్యతలను కూడా అప్పగించేందుకు బడా ఏజెన్సీలను ఎంపికచేసే పనిలో పడ్డట్టు తెలిసింది. ఇసుక కావాల్సినవారు నేరుగా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే వీలు కల్పించాలని, ఇలా బుక్ అయిన ఇసుకను ఎంపిక చేసిన ఏజెన్సీల ఆధ్వర్యంలో సంబంధిత చిరునామాకు డెలివరీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఓలా, ఊబర్ తరహాలోనే ఇసుక ధర, కిలోమీటరుకు అయ్యే రవాణా చార్జీలను నిర్ధారించి ఇసుక బుక్ చేసుకున్నవారికి సరఫరా చేయాలని, ఈ బాధ్యతలన్నీ టీజీఎండీసీ పర్యవేక్షణలో ప్రైవేట్ ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. చెల్లింపులు కూడా ఆన్‌లైన్ ద్వారానే జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

పోటీ లేకుంటే కృత్రిమ కొరత సృష్టించే అవకాశం

ఇసుక రవాణా బాధ్యతను పూర్తిగా బడా ఏజెన్సీలకు అప్పగించే దిశగా పావులు కదుపుతున్న ప్రభుత్వం, ఏడాదికి రూ.5-10 కోట్ల టర్నోవర్ ఉన్న ఒకట్రెండు ఏజెన్సీలను ఆసక్తి వ్యక్తీకరణ టెండర్ల ద్వారా ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇంతవరకు బాగానే ఉన్నా.. టెండర్ దక్కించుకున్న ఏజెన్సీకి ఇసుకపై గుత్తాధిపత్యం ఉంటుంది కాబట్టి వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించే ప్రమాదం ఉన్నదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. కృత్రిమ కొరత సృష్టించి ఇసుకను బ్లాక్ మార్కెట్‌కు తరలించే అవకాశాలు మెండుగా ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం 40 వేలకు పైగా ఇసుక లారీలు ఉండడం వల్ల ఏ ఒక్కరి గుత్తాధిపత్యానికీ అవకాశం లేదని, ఇసును అంతా ఒకటో, రెండో ఏజెన్సీల చేతిలో పెడితే ప్రజలకు ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓలా, ఊబర్ సైతం ప్రయాణికుల నుంచి ఒక్కో సమయంలో ఒక్కో విధమైన చార్జీలు వసూలు చేస్తున్నాయి. బుకింగ్ క్యాన్సిల్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇదే విధానం ఇసుకలో కూడా ఎదరయ్యే అవకాశం లేకపోలేదన్న ఉదాహరణలను వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఇసుక యార్డ్‌లు కొనసాగుతుండగా, ఇసుక కావాల్సినవారు ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత కావాలంటే అంత కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.కొత్త విధానం వస్తే ఇవన్నీ మూతపడే వీలుందని, దీనివల్ల ఇసుక సులభంగా లభించే అవకాశం లేకుండా పోతుందన్న ఆందోళన కూడా సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఏజెన్సీల ఆధీనంలోకి లారీలు

ఇంతకాలం సొంతంగా బుక్ చేసుకొని వినియోగదారులకు ఇసుక సరఫరా చేస్తున్న లారీల యజమానులు, ఇకమీదట ఏజెన్సీల ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుంది. వినియోగదారుల నుంచి వచ్చే బుకింగ్‌ల ఆధారంగా ఆసక్తి ఉన్న లారీలు రవాణా చేసేలా యాప్‌ను రూపొందిస్తున్నారు. కావాలనుకుంటే వినియోగదారుడి తరహాలోనే లారీల నిర్వాహకులు కూడా బుక్ చేసుకొని సరఫరా చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పున్నారు. మరోవైపు, ఇసుక రవాణా విధానాన్ని మార్చితే తమ బతుకులు రోడ్డున పడుతాయని ఇసుక లారీల యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొత్త విధానం వచ్చినా ప్రస్తుతం ఎంప్యానల్ అయిన లారీలు ఇసుక రవాణా చేసుకోవచ్చని, అయితే అవి తాము ఎంపికచేసే ఏజెన్సీ ఆధీనంలో పనిచేయాల్సి ఉంటుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఇసుక ధర, రవాణా చార్జీలు టీజీఎండీసీ ద్వారానే ఆన్‌లైన్‌లో నిర్ధారిస్తారు కాబట్టి ఇందులో ఇసుక లారీల ప్రమేయం ఏమీ ఉండదని, ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకొని చెల్లింపులు జరిపిన వారికి డోర్ డెలివరీ అందిస్తారని చెప్పున్నారు. ఇసుక లారీల యజమానులు బుక్ చేసుకున్నా ఎక్కడికి రవాణా చేస్తున్నారో ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుందని సమాచారం.

అబ్బే.. రవాణాకు మాత్రమే టైం పొడిగింపు

ఇసుక క్వారీల వద్ద రాత్రి 9 గంటల వరకు కార్యకలాపాలు సాగించేందుకు ఇచ్చిన ఉత్తర్వులు కేవలం ఇసుక రవాణాకు మాత్రమేనని, ఇసుక తవ్వకాలకు కాదని టీజీఎండీసీ ఎండీ వివరణ ఇచ్చారు. పర్యావరణ శాఖ నిబంధనల ప్రకారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 వరకు మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించవచ్చని, రాత్రి వేళల్లో ఇసుక రవాణాపై ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. 'రాత్రి 9 వరకు ఇసుక తవ్వకాలు' శీర్షికతో సోమవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తపై ఎండీ స్పందిస్తూ, ఇసుక క్వారీలు రాత్రి 11 గంటల వరకు కార్యకలాపాలు సాగించే విధంగా ఉత్తర్వులు ఉన్నాయని, అయినా తాము ఇసుక తవ్వకాలు సాయంత్రం 6 వరకే నిర్వహిస్తున్నామని వివరించారు.

జీవన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్ ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూ వివాదంపై నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, కుటుంబసభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణను మార్చి 3కు వాయిదా వేశారు. జీవన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులు తన భూమిని కబ్జా చేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే మారణాయుధాలతో